క్లుప్తంగా

సీపీఎస్ విధానం రద్దుకు కృషి



మక్తల్: సీపీఎస్ విధానం రద్దుకు కృషి చేస్తామని యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి అన్నారు. గురువారం మక్తల్ మండలలోని వివిధ పాఠశాలల కాంప్లెక్స్‌లను సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు క్రిష్ణయ్య, వేణుగోపాల్, శివరాజ్, వెంకటస్వామి, రాజేష్‌కుమార్, అనిల్, మహేందర్‌గౌడ్, రహ్మత్, వెంకట్, నాగరనాజు, సోమ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

5న ప్రవేశ పరీక్ష

మరికల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలో ఈ నెల 5న 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి సీఓఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష హాజరయ్యేవారు పెన్సిల్, నీలం లేదా నలుపు పెన్నులు, ప్యాడ్, హల్‌టిక్కెట్, మాస్క్ తీసుకురావాలని సూచించారు. నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ



కృష్ణా: మండలంలోని ఆలంపల్లిలో గురువారం పశువైద్యాధికారులు గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. వైద్యులు లింగప్ప పెంపకందారులు తప్పనిసరిగా తమ జీవులకు మందులు వేయించాలన్నారు. అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

కోస్గి: కొత్త మండలం గుండుమాల్ పరిధిలోని అమ్లికుంట్ల గ్రామానికి చెందిన వీఆర్‌ఏ ఊరడి బిచ్చప్ప అనారోగ్యంతో మరణించడంతో తహసీల్దార్ పాండు తమ సిబ్బందితో కలిసి వెళ్లి అంత్యక్రియలకు ఆర్థికసాయం అందించారు. బాధిత కుంటుబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా వచ్చే ఇతర అలవెన్సులు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. ఆర్ఐ వెంకట్రాములు, సిబ్బంది భీమమ్మ, మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

4న మహాసభలు

నారాయణపేట టౌన్ : సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ దామరగిద్ద, మద్దూర్ మండలాల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 4న ఏరియా మహాసభలు నిర్వహించనున్నారు. పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి నర్సింహులు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



కృష్ణా: మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని పోలీసులు అన్నారు. వాటి వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై ఐనాపూర్ గ్రామ ప్రజలకు గురువారం పోలీస్ కళాబృందం ఏఎస్ఐ వెంకటయ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రుక్యానాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం



మాగనూర్: ఉపాధ్యాయుల సంక్షేమమే ఏవీఎన్‌రెడ్డి లక్ష్యమని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తపస్ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: తపస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహులు అన్నారు. గురువారం మండలం కర్ని, అనుగొండ తదితర ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు నరేష్, రూప, ఆశోక్, వరలక్ష్మి పాల్గొన్నారు.

సిలిండర్ ధర పెంపుపై కన్నెర్ర



జిల్లాకేంద్రంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిరసన

నారాయణపేట టౌన్ : సిలిండర్ ధరలను తగ్గించాలని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, మునిబేగం, నాగమ్మ, పద్మమ్మ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. మండల అధ్యక్షుడు విజప్పగౌడ, సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివప్ప పాల్గొన్నారు.

మాగనూర్: సిలిండర్ ధరల పెంపునకు నిరసనగా మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. జెడ్పీటీసీ వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు రాజు, మధుసూదన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, మల్లారెడ్డి, పల్లెమారెప్ప, సత్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం పట్ల గురువారం ఊట్కూర్ చెక్ పోస్టు దగ్గర బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. గంటపాటు ధర్నా చేపట్టడంతో మక్తల్–నారాయణపేట పట్టణాలకు వెళ్లే వాహనాలు బారులు తీరాయి. అనంతరం నాయకులు తరలివెళ్లి తహసీల్దార్ సీహెచ్ తిరుపతికి వినతిప్రతం అందించారు. సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్ కుమార్, నాయకులు సంవృద్ధి, కతలప్ప, జయప్రకాశ్‌రెడ్డి, తరుస్, సమీ, నాసిర్‌ఖాన్ పాల్గొన్నారు.

నర్వ: గ్యాస్ సిలిండర్ల ధరను కేంద్రప్రభుత్వం వెంటనే తగ్గించి ఇబ్బందులను తీర్చాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నర్వలో ఖాళీ వంటగ్యాస్ సిలిండర్‌లతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ధరలు తగ్గించక పోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎంపీపీ జయరాములుశెట్టి, విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, వైస్ ఎంపీపీ వీణావతి, రైతు సమితి మండల కోఆర్డినేటర్ మండ్ల చిన్నయ్య, నాయకులు కిరణ్‌ప్రకాష్‌రెడ్డి, దండు అయ్యప్ప, గడ్డం నర్సిములు, హన్మంతురెడ్డి, డా.శంకర్, శ్రీకాంత్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ ధర తగ్గించాలి

మరికల్: సిలిండర్ ధరలను తరచుగా పెంచుతూ కేంద్రం సామాన్యుల నడ్డి విరుస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లంబడి తిరుపతయ్య, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్‌లు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూ. 400 ఉన్న సిలిండర్ ధర రూ.1155కి చేరిందన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని వారు డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు.



నర్వలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



ఊట్కూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో



మాగనూర్‌లో..

అల్పాహారం అందించడంలో నిర్లక్ష్యం

- రూ. 5 బిస్కెట్ ప్యాకెట్లు ఇచ్చి చేతులు దులుపుకొంటున్న వైనం

ధన్వాడ: ప్రభుత్వం పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారికి అల్పాహారం పెట్టేందుకు నిధులు మంజూరు చేసింది. కానీ క్షేత్రస్థాయిలో కొందరి నిర్లక్ష్యంతో కొన్ని చోట్ల విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అల్పాహారం పెట్టడంలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయంపై ఉపాధ్యాయులను ప్రశ్నించగా బుధవారం, గురువారం మాత్రమే పెట్టలేదని, విద్యార్థులు తక్కువగా వస్తున్నందున పిలిచి అల్పాహారం పెడదాం అనుకున్నామని వివరణ ఇచ్చారు. కాగా ప్రభుత్వం 34రోజుల పాటు అల్పాహారం పెట్టాలని ఒక్కో విద్యార్థికి రూ.15 విడుదల చేసింది. కానీ కేవలం ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో మాత్రమే ఉదయం సాయంత్రం వివిధ రకాల వంటకాలు పెడుతున్నారు. మిగతా చోట్ల పల్లిచిక్కీలు, రూ.5 బిస్కెట్ ప్యాకెట్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.



ధన్వాడ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంలేదని విద్యార్థులు తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. పాఠశాలలో మొత్తం 13మంది ఉపాధ్యాయులు ఉండగా గురువారం ఉదయం ప్రార్థన సమయానికి ఏడు మంది ఉపాధ్యాయులు, ఒక పీఈటీ మాత్రమే హాజరయ్యారని ఆరోపించారు. ఉపాధ్యాయులే ఆలస్యంగా వస్తే పిల్లల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

హామీలు నెరవేర్చాలి

కృష్ణా: బీఆర్ఎస్ నాయకులు గ్యాస్ ధరలు పెరిగాయని ఆందోళనలు చేయడానికి ముందు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా తయారు చేశారని విమర్శించారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ సురేష్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నల్లె నర్సప్ప, రాఘవేంద్ర, బాల్‌రాజ్, శివాజీ, నారాయణ, బీరప్ప, రాజు శక్తిసింగ్, తాయప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోవాలి

నర్వ: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ గౌనిజ్యోతి అన్నారు. గురువారం పెద్దకడ్మూర్‌లోని శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. నాయకులు కిరణ్‌ప్రకాష్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ వెంకటరమణ ఫాతిమా పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో కూడా వెంటనే కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వేణు, నాయకులు కొండయ్యలు అన్నారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ పల్లెల్లో కార్యక్రమం చేపట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు.

వంట చెరుకు పట్టివేత



మాగనూర్: మండలంలోని నల్లగట్టు నుంచి కృష్ణరోడ్డు వైపునకు వంట చెరుకుతో వెళ్తున్న ఒక బొలెరో, ట్రాక్టర్‌లను గురువారం పట్టుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా వాటికి ఎలాంటి అటవీ అనుమతి పత్రాలు లేవని ఫారెస్ట్ సెక్షన్ అధికారి నీలేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు నిత్యం చెట్లను నరికి వంట చెరుకు కోసం తరలిస్తున్నారని, పట్టుబడితే చర్యలు తప్పవన్నారు. వాహనాలను స్థానిక పోలిస్టేషన్‌కు తరలించామని తెలిపారు. యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు కోస్గిలో ధర్నా

కోస్గి: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారం పడుతుందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించే ధర్నా, రాస్తారోకో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు మ్యాకల రాజేష్ సూచించారు. గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పాలమూర్–తాండూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తామన్నా రు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి హాజరవుతున్నారని విజయవంతం చేయాలన్నారు. ఎంపీపీ మధుకర్ రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సాయిలు, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

మద్దూరు: బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే అవగాహన సదస్సు పోస్టర్‌ను తహసీల్దార్ రవి, ఎస్ఐ సతీష్‌లు గురువారం ఆవిష్కరించారు. విద్యార్థులకు లక్ష్యసాధన దిశ, సమయపాలన, పరీక్షల్లో భయాన్ని పోగొట్టుకోవడం, తదితర అంశాలపై శివకుమార్ సాఫ్ట్‌వేర్ స్కిల్ ట్రైనర్ ద్వారా శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. నాయకులు సంతోష రాథోడ్, శ్రావణ్, రాజేంద్ర, రాంసింగ్,పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రచారం

దామరగిద్ద: మేధావులను మండలికి పంపిచాల్సిన అవసరం ఉపాధ్యాయులపై ఎంతైన ఉందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై. అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రొఫెసర్ ఏ. వినయ్‌బాబును గెలిపించాలని మండలంలో ప్రచారం నిర్వహించారు. బహుజన ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

మద్దూరు: టీడీపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుందని నాయకులు వెంకటప్రసాద్, శ్రీనివాస్, రాములు తదితరులు తెలిపారు. గురువారం నందిపాడ్, మద్దూరు తదితర గ్రామాల్లో సభ్యత్వ నమోదు ప్రారంభించారు.

ఉపాధ్యాయుడికి కలెక్టర్ అభినందన



మల్లేశంతో జిల్లా కలెక్టర్, డీఈఓ, అధికారులు

కోస్గి: రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొన్న కోస్గి మండల ముశ్రీఫా పాఠశాల ఉపాధ్యాయుడు మల్లేశంను జిల్లా కలెక్టర్ శ్రీహర్ష అభినందించారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని జాతీయ విద్యా పరిశోధనా మరియు శిక్షణ సంస్థ సహకారంతో నిర్వహించిన సెమినార్‌లో ఉపాధ్యాయుడు మల్లేశం పాల్గొని 'ఆత్మ నిర్మాణ్ భారత్‌లో సైన్స్ పాత్ర' అనే అంశంలో ప్రదర్శన ఇచ్చారు. ప్రశంసా పత్రం అందుకున్నారు.కీ సందర్భంగా కలెక్టర్ శ్రీహర్ష, డీఈఓ లియాకత్ అలీ, ఇతర అధికారులు అభినందించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మల్దకల్ : పౌష్టికాహారంను తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. పోషకాలు ఉండే ఆహారంను తీసుకోవాలని సూచించారు. నెలనెలా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. సూపర్‌వైజర్ సత్యమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

సీపీఎస్ అధ్యక్షుడి నియామకం



నారాయణపేట రూరల్ : తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా శ్యాసన్‌పల్లిలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు అమ్మకోళ్ల భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనతో పాటు సబ్ రిజిస్టర్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రచారీని ప్రధాన కార్యదర్శిగా, బలభద్రాయపల్లి ఉపాధ్యాయుడు రాజేందర్‌రెడ్డిని కోషాధికారిగా అడహక్ కమిటీని ప్రకటించారు.

సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యం



ప్రచారంలో పాల్గొన్న నాయకులు

ఊట్కూరు: విద్యారంగ సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూ సంఘంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని పులిమామిడి, బిజ్వార్, ఊట్కూరు ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షులు శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పనిచేసే ఉపాధ్యాయ సంఘానికి పట్టం కట్టాలని అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. మీర్జాపూర్, ముశ్రీఫా, కోస్గి బాలుర ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అసోసియేట్ అధ్యక్షుడు అనంతప్ప, మండలాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దూరు: గుర్రం చెన్నకేశవరెడ్డి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంఈఓ గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'



మాట్లాడుతున్న వేణుగౌడ్

నారాయణపేట: కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షులు వాకిటి శ్రీహరి, యాత్ర సమన్వయకర్త వేణుగౌడ్‌లు పిలుపునిచ్చారు. గురువారం అన్ని మండలాల, పట్టణ అనుబంధ సంఘాల అధ్యక్షులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి పార్టీ తరపున పోరాటం చేయాలని సూచించారు. డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని, 50 మందికి పైగా ముఖ్య నాయకులు తిరిగి వస్తున్నారన్నారు. రాబోయే నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామన్నారు. నాయకులు నాగరాజు గౌడ్, పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కూన్సీ సూగప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహులు ముదిరాజ్, జి.సుధాకర్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు వేగవంతం చేయాలి



పులిమామిడిలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

ఊట్కూరు: మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేసి కూలీలకు పని కల్పించాలని డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని పులిమామిడి గ్రామంలో నర్సరీని పరిశీలించారు. అక్కడ పెంచుతున్న మొక్కల వివరాలు అడిగి తగు సూచనలు చేశారు. అనంతరం అవుసలోనిపల్లిలో పనులు జరుగుతున్న స్థలానికి వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. వారికి రోజువారీగా అందుతున్న కూలీ డబ్బుల గురించి మాట్లాడారు. వ్యవసాయ పనులు లేనందువల్ల గ్రామాలలో కూలీలకు పనులు కల్పించాలని వారం వారం వారికి డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరయ్య గౌడ్, ఎంపీడీఓ కాలప్ప, ఏపీఓ ఎల్లయ్య, ఈసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలన్నదే లక్ష్యం



విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గంలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నదే లక్ష్యమని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మక్తల్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. రూ. 10 లక్షల 50 వేల ఖర్చుతో ప్యాడ్లను అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా విద్యార్థుల కోసం మెటీరియల్స్ అందజేశామన్నారు. ఇంకా అవసరం ఉన్న విద్యార్థులు 8367266777 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ మురళీధర్‌చారి, అధ్యాపకులు ఉషారాణి, సత్యనారాయణ, విజయలక్ష్మి, రాజు, వెంకటేశ్వర్‌రాజు, పుష్పలత, శ్రీనివాస్‌రావు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్: విద్యాభివృద్ధికి కృషిచేస్తానని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం ఊట్కూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. రూ. 10 లక్షల 50 వేలతో ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేస్తున్నానని తెలిపారు. ప్రిన్సిపాల్ అంబాజీ, అధ్యాపకులు సత్యనారాయణ, వెంకటేష్, అశోక్, బసయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్‌రావు, లెక్చరర్లు రేణుక, ప్రదీప్, రమేష్, రామస్వామి, శ్రీకాంత్, గుండేరావు, గోపిమణి పాల్గొన్నారు.

అభ్యసన దీపికలతో పరీక్షలకు సన్నద్ధత



అభ్యసన దీపికలను అందిస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

నర్వ: పదో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావడం కోసం విద్యాశాఖ అభ్యసన దీపికలను రూపొందించిందని క్లస్టర్ హెచ్‌ఎంలు నర్సిములు, రాజేష్‌కుమార్‌లు అన్నారు. గురువారం ఎమ్మార్సీలో మండలంలోని ఆయా గ్రామాల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు అభ్యసన దీపికలను అందజేశారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు వివరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నర్సిములు, రాజేష్‌కుమార్, కోట్ల శ్రీనువాసులు, తిరుపతిరెడ్డి, సీఆర్పీలు నర్సిములు, రోజా తదితరులున్నారు.

నారాయణపేట రూరల్ : టెన్త్ పరీక్షల్లో చక్కటి జీపీఏ సాధనకు ఎస్సీఈఆర్టీ రూపొందించిన మెటీరియల్‌ను గురువారం పట్టణంలోని గ్రౌండ్ స్కూల్, మండలంలోని జాజాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో పంపిణీ చేశారు. కౌన్సిలర్ శిరీష, ఎస్ఎంసీ చైర్మన్ అనూష, హెచ్‌ఎంలు శ్రీనివాస్, సత్యనారాయణ, డీఎస్ఓ భానుప్రకాష్, మధు పాల్గొన్నారు.

'స్వచ్ఛభారత్'పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న అధికారులు

మాగనూర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం స్వచ్ఛ భారత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీఓ మైపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటిలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తరచుగా కాళ్లు చేతులు కడుక్కుని ఇళ్లలో పిల్లలు అందరు పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఎండీ, డీఆర్పీఎస్ మాలిక్‌పాష, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

మక్తల్: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధించగలరని మార్గనిర్దేశకుడు గంపా నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం పట్టణంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ట్రస్మా అధ్యక్షుడు కర్నిస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ పరీక్షలు భయపడకుండా రాయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రావు, ఉపాధ్యక్షులు రమేష్‌రావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజయ్యాచారీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపుపై హర్షం



మాట్లాడుతున్న నామాజీ

నారాయణపేట రూరల్: ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో కమల వికాసం శుభపరిణామమని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, కే.రతంగ పాండురెడ్డి అన్నారు. గురువారం విడుదలైన ఫలితాలు ప్రతిపక్షాలకు చెంపపెట్టన్నారు. తెలంగాణలో సైతం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పక్షపాతం లేకుండా మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఇలాంటి ఫలితాలు నిదర్శనం అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు పట్టిన గతే బీఆర్ఎస్ విషయంలో పునరావృతం అవుతుందన్నారు. అవినీతిలో కూరుకుని పోయి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ప్రజలను మోసం చేశారని, రాబోవు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో పీ.శ్రీనివాసులు, ప్రభాకర్‌వర్ధన్, సత్యాయాదవ్; విజయ్, వెంకట్రాములు, లక్ష్మి పాల్గొన్నారు.